## పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడి సాధ్యం

### కలెక్టర్ కుమార్ దీపక్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తే రైతులకు అధిక దిగుబడితో పాటు ఆర్థిక లాభం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు వాణిజ్య పంటలు, కూరగాయలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూల ప్రాంతాలు గుర్తించి రైతులను ప్రోత్సహించాలని, యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉండడంతో అర్హ రైతులకు నిబంధనల మేరకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ సమీక్షలో జిల్లా పశు వైద్య%-%పశుసంవర్ధక శాఖ అధికారి ఈ. శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా ఉద్యానవన అధికారి అనితతో పాటు విభాగాధికారులు పాల్గొన్నారు.

## వార్డుల వారీగా ఓటరు జాబితా వేగవంతం చేయాలి:

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీని వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మ-ంసాయిదా ఓటరు జాబితా స్పష్టంగా ఉండాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మందికి మించి ఓటర్లు ఉండకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు నివాస ప్రాంతాలకు సమీపంలో ఉండేలా చూడాలని అన్నారు. జనవరి 1, 2026 నాటికి పోలింగ్ కేంద్రాల వారీగా ముసాయిదా జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు, త్రాగునీటి, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, సబ్ కలెక్టర్ మనోజ్, డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ వలియత్ అలీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన నంబలా బీజేపీ సర్పంచ్




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి, శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేస్తున్న ప్రజాసేవకు ఆకర్షితులై దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన బీజేపీ సర్పంచ్ గోపే రాజమల్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గోపే రాజమల్లుకు మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలే తనను కాంగ్రెస్ వైపు ఆకర్షించాయని గోపే రాజమల్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముక్కోటి పూజలు

### విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముక్కోటి ఏకాదశి రోజున వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మంచిర్యాల నియోజకవర్గంలోని రైతులు పాడి పంటలతో సుఖసంతోషాలతో, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలి

### అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల పరిధిలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరు మూత్రశాలలు, వంటశాల, ప్రహరీ గోడతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీలో పరిశుభ్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు గణితంలో పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం రామ్‌నగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ప్రీ ప్రైమరీ పాఠశాల పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అక్కడ కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. అలాగే మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ వారికి అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్య బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా కల్పించాలి : సీపీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల (జన్నారం):**




పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ బాధితులకు అండగా ఉంటారనే నమ్మకం, భరోసా కల్పించాలని పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జన్నారం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి, కేసు వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులపై క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖపరమైన సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతం అటవీ, మారుమూల ప్రాంతం కావడంతో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో పాటు, ఫిర్యాదులను మర్యాదపూర్వకంగా స్వీకరించి చట్ట పరిధిలో పరిష్కరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో ఇండ్లలోనే ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రత్యేక మద్యం సేవించి వాహనాలు నడిపే తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, సీఐ రమణ మూర్తి, ఎస్ఐ అనూష పాల్గొన్నారు.



## బొలెరో ఢీకొని ఆటో బోల్తా..

### విద్యార్థులకు గాయాలు..

**శెనార్తి మీడియా, మంచిర్యాల (లక్సెట్టిపేట్):**

పట్టణంలోని సిఎస్ఐ చర్చి గేటు ముందు స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటోని బొలెరో ట్రాలీ ఢీకొనడంతో ఆటో కల్వర్టులో పడి ఆరుగురు విద్యార్థులకు గాయాలైనట్లు స్థానిక ఎస్ఐ గోపతి సురేష్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన రామస్వామి అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో ప్రతి రోజు భగత్ సింగ్ నగర్ కు చెందిన 9 మంది విద్యార్థులను లక్షెట్టిపేట పట్టణంలోని బాలికల పాఠశాల, బాలుర పాఠశాలకు తరలిస్తుండగా సిఐసిఐ చర్చ్ గేటు ముందు లక్షెట్టిపేట వైపు నుంచి ఆంధ్రబోర్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ఆటో రోడ్డు పక్కన ఉన్న కెనాల్ లో పడిపోయిందన్నారు. వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ విద్యార్థులను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కొంతమంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వం ఆసుపత్రికి వైద్యుల సూచన మేరకు పంపించారు. ఆటో డ్రైవర్ రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆరుతడి సాగు పై లాభాలు

- యాసంగిపై రైతులకు అవగాహన: మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల (భీమారం):**

యాసంగి కాలంలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ తెలిపారు. మంగళవారం భీమారం రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా యాసంగిలో మక్కజొన్న, జొన్న, పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి పంటలు సాగుకు అనుకూలమని వివరించారు. నీటి సౌకర్యం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ పంటలను సులభంగా సాగు చేసుకోవచ్చని చెప్పారు. తక్కువ ఖర్చుతో మంచి దిగుబడి సాధించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



## బాలల రక్షణకు ఆపరేషన్ స్మైల్...

### జిల్లా స్థాయి సమావేశం నిర్వహణ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు జిల్లా స్థాయి సమన్వయ సమావేశాలు నిర్వహించారు. సంబంధిత విభాగాల అధికారులు డీడబ్ల్యూఓ, డీసీపీయూ, సీడబ్ల్యూసీ, కార్మిక, ఆరోగ్య, విద్యా శాఖల ప్రతినిధులు, పోలీస్ సిబ్బందితో కలిసి ఈ సమావేశాలు జరిగాయి. మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ అధ్యక్షతన డీసీపీ కార్యాలయంలో ఒక సమావేశం నిర్వహించగా, పెద్దపల్లి జోన్ పరిధిలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో మరో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్, పెద్దపల్లి జోన్ (పెద్దపల్లి, గోదావరిఖని సబ్ డివిజన్) ప్రాంతాల్లో 18 సంవత్సరాల లోపు తప్పిపోయిన బాలురు, బాలికల సమాచారాన్ని సేకరించి గుర్తించిన అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ చేయాలని ఆదేశించారు. అలాగే బాలకార్మికులు, భిక్షాటనలో ఉన్న పిల్లలు, వదిలివేయబడ్డ పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించారు. బలవంతంగా భిక్షాటన చేయించినవారిపై, వెట్టి చాకిరి చేయించినవారిపై తగిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో జనవరి 1 నుంచి జనవరి 31 వరకు ప్రత్యేకంగా "ఆపరేషన్ స్మైల్%-శ××%" కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎస్ఐ స్థాయి అధికారిని నియమించి, ఆయన ఆధ్వర్యంలో నలుగురు సిబ్బంది, ఒక మహిళా కానిస్టేబుల్‌తో బృందాలు ఏర్పాటు చేస్తారు. వీరు సేకరించిన సమాచారాన్ని పోలీస్ కమిషనరేట్ స్థాయిలో సమీకరించి హైదరాబాద్‌లోని మహిళా భద్రతా విభాగం అధికారులకు పంపిస్తారని తెలిపారు. తప్పిపోయిన బాలురు, బాలికలు, బాలకార్మికులు లేదా భిక్షాటనకు గురవుతున్న పిల్లలపై సమాచారం ఉన్నట్లయితే ప్రజలు పోలీస్ శాఖకు తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.